ఆశల అన్వేషణ..


జొన్నగిరి వద్ద పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతున్న ప్రజలు

వర్షాలు పడితే చాలు ప్రతి ఒక్కరూ వేట షురూ చేస్తారు. అది మామూలు వేట కాదు.. వజ్రాల వేట. వర్షం తమకు అదృష్టాన్ని తీసుకొస్తుందా? లేదా? అని ఆశగా చూస్తుంటారు. సాధారణంగా వర్షాకాలం మొదలైందంటే అన్నదాతలు ఆకాశం వైపు చూస్తారు. చినుకు పడితే చాలు వారి ఆనందానికి అవధులు ఉండవు. కానీ అక్కడ మాత్రం రైతులతో పాటు సామాన్య ప్రజలు, ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి వజ్రాల కోసం అన్వేషిస్తుంటారు. వరుణ దేవుడి రాక కోసం ప్రార్థనలు చేస్తారు. ఒక్క తొలకరి వర్షంతో లక్షాధికారులు, కోటీశ్వరులు అయిపోవాలనే ఆశతో వజ్రాల అన్వేషణ చేస్తుంటారు. తొలకరి వర్షాలతో భూ ఉపరితలంపై ప్రత్యక్షమయ్యే వజ్రాల కోసం పత్తికొండ, తుగ్గలి, మద్దికెర ప్రాంతాలకు వేలాది మంది తరలివస్తుంటారు. కర్నూలు, అనంతపురం, మహబూబ్ నగర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి సైతం ఈ వజ్రాలను వెతికేందుకు కార్లు, ప్రత్యేక వాహనాల్లో ఆశగా వస్తున్నారు.

- తొలకరి వర్షం కోసం ఎదురుచూపు
- వజ్రాల కోసం వేలాదిగా వస్తున్న జనం
- బస్టాండ్, ఆలయాల ప్రాంగణాలే వారి ఆవాసాలు
- పత్తికొండ ప్రాంతానికి వేలాదిగా వస్తున్న ఆశావహులు

పత్తికొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): ఒక్కరాయి దొరికితే తలరాత మారిపోతుంది. తమకష్టాలను తీర్చే ఆ విలువైన రాళ్ల కోసం అక్కడి పంటపొలాల్లో ఒళ్లంతా కళ్లుచేసుకుని వెతుకులాట సాగిస్తుంటారు. మట్టిలో దాగిఉన్న తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వందల మైళ్ల దూరం నుంచి ఆశల అన్వేషణకు ప్రజలు తరలివస్తుంటారు. పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని తుగ్గలి, మద్దికెర మండలాల పరిధిలోని ఎర్రగుడి, జొన్నగిరి, చిన్నజొన్నగిరి, పగడిరాయి, అమినేబాద్, తుగ్గలి, మదనంతపురం, పెరవలి పంట పొలాల్లో విలువైన వజ్రాలు దొరుకుతుంటాయి. ఇక్కడి నేలల్లో నేలపొరల్లో వజ్రాలు, బంగారు నిక్షేపాలు దాగి ఉండడమే అందుకు కారణంగా శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా తేల్చిచెప్పారు. భూమిపొరల్లో మార్పులు సంభవించినప్పుడు కొన్నివజ్రాలు ఉపరితలానికి చేరుకుంటాయని శాస్త్రవేత్తలు సైతం ధృవీకరించారు. పంటపొలాలను రైతులు దుక్కిదున్నినప్పుడు ఇక్కడి నేలలో దాగి ఉన్న వజ్రాలు బయటకు కనిపిస్తుంటాయి.

భూమిలో దాగి ఉన్న నిక్షేపాలు

ఎర్రగుడి నుంచి తుగ్గలి వరకు ఎస్ ఆకారంలో ఉన్న బంగారు నిక్షేపాలపై 1990 నుంచే కేంద్ర ప్రభుత్వం పలు పరిశోధనలు చేసింది. అందుకు సంబంధించి బంగారు నిక్షేపాలు తవ్వేందుకు ఆస్ట్రేలియాకు చెందిన కంపెనీకి లీజును ఖరారు చేసింది. బంగారు తవ్వకాల కోసం ఇప్పటికే కంపెనీ ఇప్పటికే పలు పరిశోధనలు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధమై ఉంది. దీనికి తోడు భూమిపొరల్లో వేల అడుగుల లోతులో వజ్రాల నిక్షేపాలు ఉన్నట్లు కూడా ప్రభుత్వం కనుగొంది. అయితే అంత లోతులో ఉన్న నిక్షేపాలు వెలికితీయడం సాధ్యం కాదని ఆ ఆలోచనకు స్వస్తి చెప్పింది.

సుదూర ప్రాంతాల నుంచి

విలువైన వజ్రాల కోసం స్థానిక ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వజ్రాన్వేషణ చేస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లో అణువణువు గాలిస్తూ వజ్రాల కోసం వెతుకుతుంటారు. వెతికేందుకు వచ్చిన రోజే వజ్రం దొరికితే అమ్ముకుని ఆ డబ్బుతో వారి ప్రాంతాలకు ఆనందంగా వెళ్తారు. ఏళ్ల తరబడి వజ్రాల కోసం వెతుకుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వచ్చే ఆశావహులు ఇక్కడ కనిపిస్తుంటారు. వచ్చే ఏడాదైనా తమకు వజ్రం దొరకకపోదా తమ కష్టం తీరకపోదా అని నమ్మకంతో వచ్చి నిరాశతో మరికొందరు తిరుగుముఖం పడుతుంటారు.

బస్టాండ్, దేవాలయాల ప్రాంగణాలే ఆవాసాలు

సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు పత్తికొండ ప్రాంతానికి వజ్రాన్వేషణకు వస్తుంటారు. ఒకసారి వచ్చినవారు మూడు, నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉంటూ వజ్రాన్వేషణ చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలు కావడంతో వీరు సమీపంలోని బస్టాండ్లు, దేవాలయ ప్రాంగణాల్లో ఆవాసం ఏర్పరుచుకుంటారు. ఎలాంటి సదుపాయాలు అందుబాటులోలేని ఈ ప్రాంతంలో చలికి, వానకు ఇబ్బందులు పడుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు.


వజ్రాన్వేషణలో నిమగ్నమై ఉన్న మహిళలు

రెండేళ్లుగా వస్తున్నా...



ఈ ప్రాంతంలో వజ్రాలు దొరుకుతాయని పత్రికల్లో, టీవీల్లో చూసి తెలుసుకున్నా. రెండేళ్లుగా వజ్రాలు వెతికేందుకు ఇక్కడికి వస్తున్నాను. వారం, రెండు వారాలు ఇక్కడే ఉండి వెతికి వెళ్లిపోతున్నా. ఈసారైనా వజ్రం దొరుకుతుందన్న ఆశతో వచ్చాను.

- శ్యాంబాబు, గుంటూరు


వజ్రాన్వేషకులు వచ్చిన వాహనాలు

కుటుంబమంతా వచ్చాం



ఈ ప్రాంతంలో వజ్రాల గురించి నాకొడుకు తెలుసుకుని పోయినసారి వచ్చాడు. ఈసారి నాకొడుకుతో పాటు నేను మా ఆయన అందరం వచ్చాం. అదృష్టం తగిలి వజ్రం దొరికితే మాపాత ఇంటిని కొత్త ఇంటిగా మార్చుకుంటాం.

- లలితాబాయి, నల్లమాడ మండలం, శ్రీసత్యసాయి జిల్లా

అమ్మాయి పెళ్లి చేశా, ఇల్లు కట్టుకున్నా



మాది ఒంగోలు దగ్గర చిన్నపల్లెటూరు, నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు. కూలీచేస్తూ వారిని పోషిస్తున్నాను. ఈ ప్రాంతంలో వజ్రాల గురించి టీవీల్లో చూసి పోయిన సారి జూన్‌లో వజ్రాలు వెతికేందుకు వచ్చాను. రెండు వజ్రాలు దొరికాయి. ఒకటి రూ.4.5 లక్షలు, మరొకటి రూ.7 లక్షలకు విక్రయించి ఆ డబ్బుతో ఇంటికి వెళ్లాను. మా కుమార్తె వివాహం చేశాను. పాత ఇంటిని కొత్తగా మార్చుకున్నాను. ఈ ఏడాది మరోసారి దొరికితే మరో కుమార్తె వివాహం చేయాలని వచ్చాను. - దేవయ్య, ఒంగోలు

ఈసారే వచ్చాం



మాది కర్నూలుకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరు. ఇంటి దగ్గర పరిచయం ఉన్న నలుగురం కలిసి ఈసారే వజ్రాలు వెతికేందుకు వచ్చాం. తినేందుకు ఇంటి దగ్గరి నుంచి రొట్టెలు తెచ్చుకున్నాం. మూడు రోజులు ఇక్కడే ఉండి మా అదృష్టం ఎలాఉందో చూసుకుంటాం.

- లక్ష్మి, కర్నూలు

పది మందితో వచ్చాం



మాది అన్నమయ్య జిల్లా మదనపల్లి దగ్గర చిన్న ఊరు. పది మందితో వజ్రాలు వెతికేందుకు వచ్చాం. వారంపాటు ఇక్కడే ఉంటాం. ఏదో గుడిలో పడుకునేందుకు ఏర్పాటు చేసుకుని అక్కడే తినేందుకు వంట తయారు చేసుకుంటాం. వజ్రం దొరికితే మా పేదరికం పోతుందని, మా పిల్లలకు ఆ డబ్బులు పనికొస్తాయన్న ఆశతో వచ్చాం.

- బేబమ్మ, మదనపల్లి, అన్నమయ్య జిల్లా

ముగిసిన ఏపీఈఏపీ సెట్

జిల్లాలో 94.36 శాతం హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష ముగిసింది. మంగళవారం జరిగిన ఇంజనీరింగ్ పరీక్షకు 1261 మందికి గాను 1168 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 19న ఈ ప్రవేశ పరీక్ష ప్రారంభమైంది. జిల్లాలో మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షకు మొత్తం 18,892 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 17,827 మంది పరీక్షకు హాజరై, 94.36 శాతం హాజరు నమోదైంది. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సు పరీక్షకు 6370 మందికి గాను 5972 మంది హాజరై 93.19 శాతం నమోదైంది. ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగం ప్రవేశ పరీక్షకు 12,522 మందికి గాను 11,855 మంది హాజరై 94.64 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, పరీక్షల నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.

నేటి నుంచి సప్లిమెంటరీ ప్రాక్టికల్స్

ఆర్‌ఐవో గురువయ్యశెట్టి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయని వివరించారు. కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళశాల, బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఇందులో జనరల్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలకు 64 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సు పరీక్షకు 89 మంది హాజరవుతున్నారని వెల్లడించారు. జిల్లాలోని కళాశాల ప్రిన్సిపాల్స్, సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆయా పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని ఆర్‌ఐవో సూచించారు.

దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది పది, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన జిల్లాలోని బలిజ విద్యార్థులకు అందజేస్తున్న ప్రతిభా పురస్కారాల దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు నగర బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులని వారు పేర్కొన్నారు. అర్హతగల విద్యార్థులు తమ మార్కుల జాబితా, చిరునామా, ఫోన్ నెంబర్లను సంఘ ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్ సెల్ నెం. 9000009440కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. ఈనెల 30లోగా దరఖాస్తులు పంపుకోవాలని, జూన్1న నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు పురస్కారాలు అందజేస్తామని వివరించారు. ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులతోపాటు హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

జమిలిపై పవన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- సూపర్ సిక్స్ అమలలో కూటమి ప్రభుత్వం విఫలం
- రైతుల ఖాతాల్లో రూ. 20వేలు జమ చేయాలి
- జూన్2న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమిళనాడులోని డీఎంకేతో మాట్లాడతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. మంగళవారం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సూపర్ సిక్స్‌లో అమలులో విఫలమైందని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చాక నిత్యాసవర వస్తువుల ధరలు తగ్గించారా.. నిరుద్యోగం తగ్గిందా.. విదేశాల్లోని నల్లడబ్బును తెచ్చారా? అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో యుద్ధం ఎందుకు విరమించారో మోదీ సమాధానం చెప్పాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే యుదం విరమిస్తారా అని, దేశ పరువు ప్రతిష్టలు దిగజారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు వైఖరి మార్చుకోవాలని పీఎం మోదీని పొగు డ్తున్న ఈ విషయంపై డిబెట్‌కు రావాలన్నారు. రైతులకు ఇస్తామని పెట్టుబడి కేంద్రంతో కలిపి రూ.20 వేలు వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టే ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గసభ్యులు కే.జగన్నాథం, జి.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు సి.మహేష్, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అదృష్టం

మహానాడులో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు, మే 27 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గుర్తింపు పొందిన సీఎం చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి దక్కడం అదృష్ట మని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కడప జిల్లా మహానాడులో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. చంద్రబాబు లాంటి గొప్ప నాయకత్వంలో తాను మంత్రిగా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. చంద్రబాబు అంటే ఓ బ్రాండ్ అని ఏ దేశానికి వెళ్లినా చంద్రబాబు గురించి చర్చించుకుంటున్నారని అన్నారు. యువనేత, మంత్రి నారా లోకేశ్ యువగళం పేరిట పాదయాత్ర చేసి జనంతో మమేకమై టీడీపీని అధికారంలోకి తీసుకురావడంతో కీలకమైన పాత్ర పోషించారన్నారు. ప్రజల కష్టాలు దగ్గర చూసిన వ్యక్తి యువనేత లోకేశ్ అన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతే.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చితీరుతామని టీజీ భరత్ పేర్కొన్నారు.


మహానాడు వేదికపై మాట్లాడుతున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.75 కోట్లు


నంద్యాల కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలోని హుండీల లెక్కింపు మంగళవారం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. హుండీలను లెక్కించగా గత 28 రోజులకు గాను రూ.3,74,99,234 వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే హుండీలో 120.10 గ్రాముల బంగారు, 4.26 కిలోల వెండి లభించాయన్నారు. అదేవిధంగా 377 యూఎస్‌ఏ డాలర్లు, 25 సింగపూర్ డాలర్లు, 10కెనడా డాలర్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు, 200 యూకే పౌండ్స్, 30 ఈరోస్, 21 కువైట్ దినార్, వెయ్యి వియత్నాం డాంగ్స్, 44 మలేషియా రింగిట్స్, వెయ్యి జపాన్ ఎన్స్, 10 మాల్దీవుల రుఫియాస్ మొదలైన విదేశీ కరెన్సీకూడా ఈ హుండీలో లభించాయన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో డిప్యూటి కార్యనిర్వహణాధికారి రమణమ్మ, పలు విభాగాల అధికారులు, శివసేవకులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపులో పాల్గొన్న శివసేవకులు, ఆలయ సిబ్బంది

పద్మశ్రీ అందుకున్న వీఆర్ పంచముఖి


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకుంటున్న వీఆర్ పంచముఖి

మంత్రాలయం, మే 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురు సార్వభౌమ సంస్కృత పాఠశాల కులపతి వాదిరాజ్ పంచ ముఖి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వీఆర్ పంచముఖికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మఠం అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



మహానాడు సంబరం

కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.

ఐపీపీబీ ఖాతాల కోసం ప్రత్యేక డ్రైవ్

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)ఖాతాలను తెరిచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఏపీపీబీ కొత్తఖాతాలు తెరవడం, ఆధార్ అను సంధానం చేయడానికి ఈనెల 31నుంచి జూన్ 4 వరకు ప్రత్యే క డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేయడం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపింగ్‌లను సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న 15,365 ఖాతాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న 434 పోస్టాఫీసుల ద్వారా పునరుద్ధరణ చేసినట్లు వివరించారు. మరిన్ని వివరాల కోసం దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

'ఉద్యం' రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పిస్తాం

జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మే 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్‌పై పరి శ్రమల యజమానులకు అవగాహన కల్పిస్తామనిజిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ తెలిపారు. మంగళవారం ఆమె కార్యాలయ గదిలో విలేకరులతో మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానులు తమ పేర్లను తక్షణమే ఉద్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఉద్యం రిజిస్ట్రేషన్ పోర్టల్‌పై బుధవారం తమ కార్యాలయ ప్రాంగణంలో అవసరార్థులకు కార్యశాల నిర్వహిస్తు న్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు ఉద్యం పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకొని యజమానులకు ఉచితంగా నమోదు చేయిస్తామని తెలిపారు. దీంతో భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలను సులువుగా పొంద వచ్చునని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్

కర్నూలు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీ(ఆర్‌యూ) పరిధిలో జరిగిన 2, 6 సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 2వ సెమిస్టర్‌కు 10, 110 మందికి 9,02 మంది, 6వ సెమిస్టర్‌కు 175 మంది దరఖాస్తు చేసుకోగా 155 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు. శ్రీశంకరాస్ డిగ్రీ కళాశాల, కర్నూలు-1, సాధన డిగ్రీ కళాశాల, నంద్యాల-1, ఎస్టీ జోసెఫ్స్ కాలేజీ ఫర్ ఉమెన్స్, కర్నూలు-1 విద్యార్థులు పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో డిబార్ చేశామని తెలిపారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

- బదిలీల కోసం 134 మంది దరఖాస్తు
- ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 57 మంది
- జూన్ 2 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో వివిధ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు సంబంధించి బదిలీల దరఖాస్తుల స్వీకరణకు మంగళ వారం గడువు ముగిసింది. ఈమేరకు ఎంపిడీవో, పరిపాలన అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు, రికార్డు, లైబ్రరీ, ల్యాబ్ అసిస్టెంట్లు, నాల్గవ తరగతి ఉద్యోగులు, స్వీపర్, వాచ్‌మెన్‌లు మొత్తంగా 134 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐదేళ్ల పూర్తి చేసిన వారు 57, ఐదు సంవత్సరాలు లోపు ఉన్నవారు 77 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి ప్రాధాన్యత క్రమంలో బదిలీలు చేపట్టేవిధంగా ప్రభుత్వం నిబంధనలు జారీచేసింది. ఈ మేరకు అధికారులు ఈ క్రమంలో కసరత్తు ప్రారంభించారు. జూన్ 2 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

పోలీసులే అంత్యక్రియలు చేయడం అమానుషం

- ప్రజా సంఘాల నాయకులు
- మావోయిస్టుల ఎన్‌కౌంటర్ దుర్మార్గమైన చర్య
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- నంబాల కుటుంబ సభ్యులను బెదిరించిన మంత్రి, ఎస్పీ
- విరసం నాయకుడు పాణి

కర్నూలు న్యూసిటీ, మే27(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో భద్రతాదళాల కాల్పుల్లో చంపబడ్డ మావోయిస్టుల మృతదేహాలను బంధువు లకు ఇవ్వకుండా పోలీసులే అంత్యక్రియలు చేయడం అమా నుషమని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో పోలీసుల తీరు ను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం,పీఓపీ, విరసం, ఎస్‌డీపీఐ, న్యూడెమోక్రసీ, సీపీఐ (ఎంఎల్), ఆర్‌పీవీ, కేఎన్‌పీఎస్ ఇతర ప్రజాసంఘాల అధ్వర్యంలో సీపీఐ కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయి స్టుల కుటుంబ సభ్యులు ఐదు రోజులుగా నారాయణపూర్‌లోని జిల్లా ఆసుపత్రి వద్ద పడిగాపులు కాచినా వాళ్లకు మృతదేహాలను ఇవ్వ కుండా పోలీసులే దహనం చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు.

ప్రజాభ్యుదయ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలు జరప కుండా ఇలా ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ మొత్తం ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ శవాలకు కూడా హక్కు లు ఉంటాయని, మృతులు ఏరంగానికి చెందినవారైనా వారి మృతదేహాలకు అంత్యక్రియలు, అంతిమ సంస్కారాలు నిర్వహించు కునే హక్కు కుటుంబసభ్యులకు ఉంటుందన్నారు. మృతుల శరీరాలు ఆంధ్రప్రదేశ్‌కు ఎట్టి పరిస్థితుల్లో రాకూడ దని మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర రెడ్డి మావోయిస్టు నంబాల కేశరావు కుటుంబసభ్యులను బెదిరించారని అన్నారు. పౌరహక్కుల సంఘం నాయకుడు అల్లాబకష్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగానే మావోయిస్టు నాయకుల మృత దేహాలు కుటుంబం వారికి అందకుండా చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం కోర్టును కూడా ధిక్కరించి శవాలను దహనం చేసిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయ కుడు వెంకటస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు భాస్కర్, సీపీఐ సీనియర్ నాయకుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, రాయలసీమ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్‌డీపీఐ చాంద్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపిక గ్రామాల్లో మౌలిక సదుపాయాలు
- జూన్ 15 నుంచి అమలు
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి అమలు చేస్తున్న 'దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ భాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఈఅభియాన్ అమలుపై సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 500 లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన కనీసం 50 శాతం గిరిజన నివాసితులు కలిగిన జిల్లాలోని గ్రామాల్లో దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సామాజిక- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి తులసిదేవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, డీఈవో శామ్యూల్ పాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఎల్‌డీఎం రామచంద్రరావు, డీఎంహెచ్‌వో శాంతికళ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఎస్‌వో రఘువీర్, డీఎం సివిల్ సప్లయిస్ నాగసుధ పాల్గొన్నారు.



ఏడు గ్రామాల ఎంపిక

జిల్లాలో ఏడు గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి, నెరవణికి, హొళగుంద మండలంలోని కోగిలితోట, హొళగుంద, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంప గ్రామాల్లో ఈపథకం అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల్లో పక్కా గృహాలు, రోడ్లు, జల్‌జీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, ఆయుష్మాన్ కార్డులు, అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాట్లు, ఎల్‌పీజీ కనెక్షన్లు, వ్యవసాయ విద్యుద్దీకరణ, హాస్టళ్ల ఏర్పాటు, ఆయుష్మాన్ శాఖ ద్వారా పోషణ వాటికలు తదితర పథకాలను అమలు చేయాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

17 శాఖల ద్వారా..

జూన్ 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని, 17 శాఖల ద్వారా ఈ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థా యిలో అమలు కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై క్రమంతప్పకుండా సమీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎప్పుడు కూలుతుందో?

- పొంచి ఉన్న ప్రమాదం
- శిథిలావస్థలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధులు
- వర్షం వస్తే తడుస్తున్న సామగ్రి, రికార్డులు



కూలడానికి సిద్ధంగా ఉన్న బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బనగానపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం నేడో.. రేపో అన్నట్లు కూలడానికి సిద్ధంగా ఉంది. శిథిలావస్థకు సబ్ కార్యాలయం చేరుకుంది. దీంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 100ఏళ్ల క్రితం నవాబుల కాలంలో ఈభవాన్ని నిర్మించారు. భవనం ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా, పై భాగంలో ఉన్న కప్పు కూడా పూర్తిగా దెబ్బతినింది. వర్షం కురిస్తే చాలు కార్యాలయంలోని కంప్యూటర్లు, రికార్డులు తడిచిపోయి పనులు నిలిచిపో తున్నాయి. దీంతో ఎవరైనా పాత నకిలీ రిజిస్ట్రార్ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి ఆలస్యం అవుతోంది.

కరువైన కనీస సౌకర్యాలు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కార్యాలయానికి ప్రహరీ లేదు. అలాగే రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బనగానపల్లె, సంజామల మండలాల నుంచి నిత్యం వందలాది మంది రైతులు, ప్రజలు వస్తుంటారు. కనీసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వారు కూర్చోడానికి కూడా స్థలం లేదు. తాగునీటి వసతి కూడా లేదు. దీంతో ప్రజలు నీటి కోసం హోటళ్లను ఆశ్రయిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపినా..

గతంలో అనేకసార్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్ మాత్రం రాలేదు. వేసవి కాలంలో రైతులు, ప్రజలు కార్యాలయానికి రావాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజలకు కూర్చోడానికి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే యుద్ధప్రాతిపదికన నిధులు విడుదల చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

రేషన్ సక్రమంగా అందించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు నగరంలోని చాణిక్యపురి కాలనీలో ఉన్న పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎఫ్‌పీ షాపులకు సరఫరా చేసే రేషన్ సరుకుల నాణ్యతను, తూకాలు వేసే యంత్రాలను పరిశీలించారు. స్టాక్ పాయింట్స్‌లో ఏయే వస్తువులు ఎంత స్టాక్ ఉన్నాయని రిజిస్టర్లను పరిశీలించారు. తూకాల్లో తేడాలు ఉండకూడదని, ప్రజలకు రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డీఎం నాగసుధ, డీఎస్‌వో రాజా రఘువీర్, కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ పరిమళ పాల్గొన్నారు.

మహానాడులో తెలుగు తమ్ముళ్లు




నంద్యాల కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

కర్నూలు, మే 27 (ఆంధ్రజ్యోతి): కడప వేదికగా మంగళవారం ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ శ్రేణుల మూడు రోజుల పండుగ మహానాడుకు ఉమ్మడి కర్నూలు నుంచి టీడీపీ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సహా 14 అసెంబ్లీ నియోజకర్గాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు తరలివెళ్లారు. మహానాడులో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాంబాబు, గౌరు చరితారెడ్డి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఆదోని, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ కటౌట్ల వద్ద టీడీపీ కార్యకర్తలు ఫొటోలు దిగారు.



మహానాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పార్టీ నాయకులు వీరభద్రగౌడ్, ధర్మవరం సుబ్బారెడ్డి, భూమా బ్రహ్మానందరెడ్డి



మహానాడులో జిల్లా మంత్రి టీజీ భరత్, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఉమాపతి నాయుడు తదితరులు




హోంశాఖ మంత్రి అనితతో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్.. నారా లోకేశ్‌తో సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మహానాడు వేదికపై మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, నాయకులు దేవేంద్రప్ప, రాఘవేంద్రరెడ్డి

వేరుశనగ సబ్సిడీ 40 శాతం

- ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రైతులకు వేరుశనగ విత్తన కాయల ధరలతో పాటు 40 శాతం సబ్సిడీని ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సబ్సిడీ ఏ రకం విత్తనం వివరాలు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 11,118 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కే-6 రకం క్వింటం పూర్తి ధర రూ.9,300 కాగా, ప్రభుత్వ రాయితీ 3,720 పోను రైతు వాటా రూ.5,580 చెల్లించాలని ఈ లెక్కన 30 కిలోల బస్తాకు రూ.1,674 ధర ఉంటుందని స్పష్టం చేశారు. అదే విధంగా రాయితీ పోను నారాయణి రకం వేరుశనగ విత్తనం 30 కిలోల బ్యాగ్‌కు రూ.1,710, లేపాక్షి రకం 30 కిలోల ధర రూ.1,476గా ఖరారు చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా వీలైనంత త్వరగా పంపిణీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

ఆళ్లగడ్డ మే 27(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని సబ్ జైలును మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని అన్నారు. న్యాయవా దులను నియమించుకోలేని నిరుపేద ఖైదీలకు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం సబ్ జైలు రికార్డులను, ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ లార్డ్ వర్డ్ వర్స్ మోహన్, మెడికల్ అధికారి నాగమస్తాన్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తాపడ్డ ట్రాక్టర్

చాగలమర్రి, మే 27 (ఆంధ్రజ్యోతి): 40వ జాతీయ రహదారిలో విద్యుత్ స్తంభాలు తీసుకెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ప్రమాద వశాత్తు బోల్తాపడింది. శ్యామ్‌సన్, విష్ణు అనే రైతులు చాగలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి నేలంపాడు గ్రామానికి విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నగల్లపాడు సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న రైతులు శ్యామ్‌సన్, విష్ణు గాయ పడ్డారు. వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ సాయంతో బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

బండిఆత్మకూరు, మే27(ఆంధ్రజ్యోతి):మండలంలోని సంత జూటూరు గ్రామంలో బేబి(42) అనే మహిళ మంగళవారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బేబీ 7 సంవత్సరాల నుంచి షుగర్ వ్యాధితో బాధపడుతూ, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యా యత్నం చేసినట్లు తెలుస్తోంది. మృతురాలి కుమారుడు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక..

తుగ్గలి, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రామచంద్ర భార్య రుక్మిణి(47) కడుపు నొప్పి తాళలేక సోమవారం విష ద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు గుత్తి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తమ్ముడు జయరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కృష్ణవేణి, రామచంద్రకు 25 ఏళ్ల క్రితం వివాహం కాగా సంతానం కలగలేదు.

వైద్య పరికరాల కొనుగోలుపై సమావేశం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, మే 27(ఆంధ్రజ్యోతి): జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్య పరికరాల కొనుగోలుపై మంగళవారం సమావేశం జరిగింది. ఇందులో ఏఎంసీలో ఆక్సిజన్ ప్యానెల్, రెండు హీమో డయాలసిస్ మిషన్లు, హారిజంటల్ ఆటో క్లియర్ ఎయిర్ కంప్రెసర్ పరికరాలను కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. కొత్త పరికరాలతో రోగులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఎండోక్రైనాలజీ, ఆర్థో, అనస్థీషియా విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ పి.శ్రీనివాసులు, కె.శ్రీనివాస్, విశాల మెడిసిన్ ప్రొఫెసర్ లక్ష్మీబాయి, సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉత్కంఠగా పీఆర్ ఉద్యోగుల కౌన్సెలింగ్

- కొందరికి బదిలీ.. మరికొందరికి యథాస్థానం



అనంతపురం పీఆర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పంచాయితీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్

నంద్యాల, మే 27(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలోని పంచాయతీ రాజ్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ఉత్కంఠగా సాగింది. మంగళవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్‌తో పాటు రాయలసీమ పరిధిలోని (జోన్-4)కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప ఉమ్మడి జిల్లాల ఎస్ఈలు, ఈఈల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయం త్రం వరకు కౌన్సెలింగ్ ఉత్కంఠగా సాగింది. ముందుగా ఆయా జిల్లాల పరిధిలో ఐదేళ్లు పూర్తయిన డీఈఈలు, ఏఈలు, ఏఈఈలతో పాటు తదితర విభాగాల ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు పీఆర్ఐ డివిజన్ డీఈఈగా పనిచేస్తున్న ధనిబాబును కర్నూలు క్యూసీ-1 డీఈఈగా బదిలీ చేశారు. ఇక్కడ క్యూసీ-1 డీఈఈగా పనిచేస్తున్న హెచ్‌డీ వీరన్నను నందికొట్కూరు పీఐయూకు బదిలీ చేశారు. నంద్యాల క్యూసీ విభాగం డీఈఈగా పనిచేస్తున్న కేఎస్ఆర్ మోహన్‌రావు నంద్యాల పీఐయూకు బదిలీ చేశారు. అదేవిధంగా రిక్వెస్ట్ బదిలీ కింద నంద్యాల డీపీఆర్ఈఏ పీఏగా పనిచేస్తున్న డీఈఈ సుధాకర్‌రెడ్డిని క్యూసీ విభాగం నంద్యాలకు, కర్నూలు ఎస్ఈ పీఏగా పనిచేస్తున్న డీఈఈ సుధాకర్‌బాబును నంద్యాల పీఆర్ఐకు బదిలీ చేశారు. అనంతపురం జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన నలుగురు డీఈఈలు ఉండగా.. వీరిలో త్వరలో పదవీ విరమణ ఉండటంతో అనంతపురం పీఐయూ డీఈఈగా పనిచేస్తున్న భరత్‌ప్రకాష్‌రెడ్డి, అనంతపురం క్యూసీ డీఈఈ రవీంద్రను యథాస్థానాల్లో ఉంచారు. అదేవిధంగా గుత్తి డీఈఈగా పనిచేస్తున్న డీఎల్ మురళీతో పాటు శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి పీఐయూ డీఈఈగా పనిచేస్తున్న మధుప్రకాష్ రెడ్డి ఆ శాఖ ఉద్యోగుల యూని యన్‌లో ఉండటంతో యథాస్థానాల్లో ఉంచారు. కడప జిల్లాలోని ఎస్ఈ పీఏగా పనిచేస్తున్న డీఈఈ రాముడిని జమ్మలమడుగు క్యూసీ డివిజన్‌కు బదిలీ చేశారు.

కర్నూలు జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన ఏఈలు ఏడుగురు ఉండగా.. వీరిలో ఒకరిని మాత్రమే బదిలీ చేసి మిగిలిన వారిని యథాస్థానాల్లో ఉంచారు. అనంతపురం జిల్లాలో ఏడుగురు ఏఈలు ఉండగా. ముగ్గురు ఏఈలను బదిలీ చేసి.. మిగిలిన నలుగురు ఏఈలను యథాస్థానాల్లో ఉంచారు. కడప జిల్లాలో ఆరుగురు ఏఈలు ఉండగా.. ఇద్దరు ఏఈలను బదిలీ చేసి మిగిలిన నలుగురిని అక్కడే పోస్టింగ్ కల్పించారు. రిక్వెస్ట్ బదిలీ కింద కర్నూలు జిల్లాలో ఇద్దరు, అనంతపురంలో ఆరుగురు, కడపలో ఆరుగురు, చిత్తూరులో ఒకరు ఏఈల చొప్పున బదిలీ చేశారు.

ఇద్దరు సూపరింటెండెంట్ల బదిలీ

అనంతపురం పీఆర్ ఎస్ఈ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గీతమ్మను నంద్యాలకు, ఇక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ రమాదేవిని అనంతపురానికి బదిలీ చేశారు. అదేవిధంగా టీవో(టెక్నికల్ ఆఫీసర్స్) అనంతపురం పీఆర్ఐ డివిజన్‌లో టీవోగా పనిచేస్తున్న భానుప్రకాష్‌ను నంద్యాలకు బదిలీ చేయగా.. చిత్తూరులో టీవోగా పనిచేస్తున్న అరుంధతిని అనంతపురానికి బదిలీ చేశారు.

కడసారి చూపునకు నోచుకోలేకపోయాం

- మావోయిస్టు లలిత కుటుంబ సభ్యుల ఆవేదన



కన్నీరుమున్నీరవుతున్న లలిత తల్లిదండ్రులు, బంధువులు

ఆస్పరి, మే27(ఆంధ్రజ్యోతి): ఎప్పుడో 22 ఏళ్ల క్రితం తమ కుమార్తె లలిత మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లిందని, తామంతా మిస్సింగ్ అయ్యిందని, ఎక్కడో ఓ చోట ఉండి ఉంటుందని అనుకున్నామని ములుగుందం గ్రామానికి చెందిన ఆమె తల్లిదండ్రులు ఎస్తేరమ్మ, గోనెగండ్ల దుబ్బన్న, తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 22న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు లలిత అలియాస్ సంగీత పోలీసు కాల్పుల్లో మృతిచెందిందన్న సమాచారం కుటుంబసభ్యులకు తెలిసింది. నిరుపేదలమైన తాము లలితను ఎంతో ఆశతో చదివించామని, 22 యేళ్ల క్రితం ఏదో ఉద్యోగం చేసుకుంటానని వెళ్లిన కూతురు ఇక తిరిగి రాలేదని అన్నారు. విప్లవోద్యమంలో పని చేస్తూ చివరికి ఇలా మృత్యుఒడి చేరుకుంటుందని అనుకోలేదని ఆవేదన చెందారు. పోలీసులు మానవత్వంతో మృతదేహాన్ని అయినా ఇస్తారని తమ కొడుకులు వెళ్లారని, అయినా వారు దుర్మార్గంగా వ్యవహరించారని లలిత తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

మా అమ్మ కోలుకోవడం కష్టం



మా నలుగురు తమ్ముళ్లకు ఊహ తెలియని వయసులోనే మా అక్క లలిత కుటుంబాన్ని విడిచి వెళ్లింది. ఎక్కడో ఓ చోట ఉంటుందని మా అమ్మ, నాన్నలు చెబుతూ వచ్చారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిందన్న సమాచారం తెలియడంతో దిగ్భ్రాంతికి గురయ్యాం. మా అమ్మ అప్పటి నుంచి మంచం పట్టింది. మా అక్క మృతితో మా అమ్మ కోలుకోవడం కష్టంగా మారింది. కనీసం మృతదేహాన్ని అయినా చూసి దుఃఖాన్ని దిగమింగుకున్నామన్న ఆశ కూడా లేకపోయింది. **- ఎర్రప్ప, లలిత తమ్ముడు, ములుగుందం గ్రామం**

తైక్వాండో చాంపియన్‌గా కర్నూలు



తైక్వాండో విజేత కర్నూలు జట్టుతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు మొదటి స్థానంలో నిలిచి బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధిం చారు. రెండో స్థానంలో నంద్యాల, మూడో స్థానంలో ఎమ్మిగనూరు క్రీడాకారులు నిలిచారు. కార్యక్రమానికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో విజయకుమార్, కార్యదర్శి శ్రీనివా సులు, జిల్లా తైక్వాండో సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి సతీష్ కుమార్, నంద్యాల ఇన్‌చార్జి అబ్దుల్ మజీద్, పోటీల పర్యవేక్షకులు సాయిబాబా, నయూబ్ రసూల్‌లు పాల్గొని విజేతలకు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వీరేష్‌బాబు, శివన్న, పరమేష్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

సమ్మెకు వ్యవసాయ, కార్మిక సంఘాల మద్దతు

న్యూఢిల్లీ, మే 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామీణ పేదలు, రైతులు, దళిత, ఆదివాసీ, మహిళా సమస్యల పరిష్కారం తదితర ప్రధాన డిమాండ్లతో జూలై 9న జాతీయ ట్రేడ్ యూనియన్లు నిర్వహించే సాధారణ సమ్మెకు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని ఏఐఏఆర్ఎల్ఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పంట లకు మద్దతు ధర, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని, కనీస వేతనం రూ.600, ఆహార భద్రత కింద ప్రతి ఒక్కరికీ 10 కిలోల బియ్యం, నిత్యావసరాలు కల్పించాలని, తొలగించిన రేషన్ కార్డులను పునరుద్ధరించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ విరమించుకోవాలని, దళిత, ఆదివాసీ, మహిళల హక్కు లను పరిరక్షించాలనే డిమాండ్ల సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని ఆయా సంఘాల నేతలు ప్రకటించారు.

ఎమర్జెన్సీ మెడిసిన్ ఎంతో కీలకం

- సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర్లు



కేక్ కట్‌చేస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఎంతో కీలకమైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఉదయం క్యాజువాల్టీలో ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. క్యాజువాల్టీకి వచ్చే రోగులకు ప్రతిరోజు 24 గంటలు వైద్యులు సేవలు చేస్తు ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు రోగులకు తక్షణ వైద్య సాయం అందించడానికి వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అనస్థీషియా సీని యర్ ప్రొఫెసర్లు డాక్టర్ రామశివ నాయక్, సుధీర్, సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ రామకృష్ణ నాయక్, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, క్యాజువాల్టీ సీఎంవో ఫయాజ్ పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ 61వ వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని బాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్య సౌధానికి జవహర్‌లాల్ నెహ్రూ నిర్మాత అని, ప్రధానిగా దేశానికి చేసిన సేవలు మరువలేని కొనియాడారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న, సాంబశివుడు, షేక్ ఖాజా హుస్సేన్, లాజరస్, రాజేంద్రప్రసాద్, అనంత రత్నం మాదిగ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో మంగళవారం భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ ముఖ్య అతిథిగా విచ్చేసి తొలుత నెహ్రూ, కందుకూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయ సంస్థలో కొనసాగుతున్న బాలల వేసవి శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. శిక్షణ తరగతుల అధ్యాపకులు సుధీర్‌రాజు, యాగంటీశ్వరప్ప, గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క, లైబ్రేరియన్లు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

కర్నూలు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీని కాపాడుకుందామని జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాదీర్ అనే వ్యక్తికి తమ యూనియన్‌కు సంబంధం లేదని, తాను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించుకుంటున్నాడని, దానిని నమ్మవద్దని అన్నారు. ఈసమావేశంలో సిటీ అధ్యక్షులు రేపల్లే ప్రతాప్, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ కార్యదర్శి సిరాజ్ బాషా, కర్నూలు నియోజవర్గ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్, ఆనందం, కిషోర్, జేమ్స్ పాల్గొన్నారు.

నగరాన్ని అందంగా ఉంచుదాం

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): నగరాన్ని అందంగా ఉంచుదామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ అధికారుల అనుమతి లేకుండా నగరంలోని ప్రధాన కూడళ్లు, డివైడర్లు, గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాబట్టి రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థలు నగర పాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. దీనిని ఎవరైనా అతిక్రమిస్తే వారిపై మున్సిపల్ కౌన్సిల్ సీఆర్. నెం.78 ప్రకారం జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నన్నూరు వాసికి డాక్టరేట్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 27(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన డి.జయనారాయణరెడ్డికి అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. జయనారాయరెడ్డి వ్యవసాయ రంగాన్ని ఆధునికీకరణతో లోతైన పరిశోధన చేశారు. 'డీప్ లెర్నింగ్ ఆధారంగా పంటల దిగుబడి, అంచనా' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ ఎం. రుద్రకుమార్ పర్యవేక్షణలో ఈ పరిశోధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జయనారాయణరెడ్డికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన జనసేన నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 27(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు విచ్చేసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ కేదారి ఈశ్వర్‌ను మంగళవారం జనసేన నాయకులు పీబీవీ సుబ్బయ్య తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శాలివాహనులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు కీర్తి, యు.నటరాజ్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు ఉన్నారు. అలాగే కేదారి ఈశ్వర్‌ను కర్నూలు శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సోమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజా రప్ప, వర్కింగ్ ప్రెసిడెంటు గూడెంపాడు శ్రీనివాసులు కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మదు, సీఐ నాగేశ్వరావు, లింగన్న, రామచంద్రుడు పాల్గొన్నారు.

చౌక దుకాణం తనిఖీ

సి.బెళగల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబదహాల్ గ్రామంలో మంగళవారం తహసీల్దార్ పురుషోత్తం చౌకదుకాణాన్ని తనిఖీ చేశారు. పురుషోత్తం మాట్లాడుతూ బియ్యం కార్డుదారులకు ఉదయం 8 నుంచి 12 గంటలకు వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలకు వరకు, వయో వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ ఇవ్వాలని తహసీల్దార్ డీలర్లకు సూచించారు.

కాలిపోయిన విద్యుత్ సామగ్రి

సి.బెళగల్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రమైన సి.బెళగల్, ఇనండ్ల, పోలకల్లు, కంబందహాల్, పలుకుదొడ్డి గ్రామాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయి. విద్యుత్ ఏఈ సుకుమార్ మాట్లాడుతూ ఉరుముల ప్రభావానికి టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయినట్లు తెలిపారు.

ఆహ్లాదమేదీ?

● పార్కుల్లో కనిపించని పచ్చదనం ● నిర్వహణ అధ్వానం
● పత్తాలేని ప్రగతి ● వెనుదిరుగుతున్న పిల్లలు, తల్లిదండ్రులు
● అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునేవారేరీ?



సంకల్‌బాగ్ పార్కులో పేరుకుపోయిన చెత్త



అశోక్‌నగర్‌లో పార్కులో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): నగర వాసికి ఆహ్లాదం దూరమైంది. నగరపాలక సంస్థ పరిధిలో పార్కులు అస్తవ్యస్తంగా మారాయి. పార్కుల అభివృద్ధిని అధికారులు, పాలకులు విస్మరించారు. చాలా ప్రాంతాల్లో పార్కుల్లో పచ్చదనం కరువైంది. ప్రస్తుతం వేసవి సెల వుల నేపథ్యంలో పిల్లలందరూ తమ తల్లిదండ్రులతో కలిసి పార్కులకు వచ్చి ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తుంటారు. చాలా ప్రాంతాల్లో పార్కులు కళావిహీనంగా ఉండటంతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలో 155కి పైగా పార్కు స్థలాలున్నాయి. ఇందులో కేవలం 62 పార్కులు మాత్రమే అభివృద్ధి చేశారు. మిగిలిన వాటిని బాగుచేసే విషయంలో అధికారుల దృష్టి సారించడం లేదు. కొన్ని ప్రాంతాలలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినా పట్టించుకునే వారే కరువయ్యారు. మరికొన్ని ప్రదేశాల్లో పార్కు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

రుసుము చెల్లించాల్సిందే..

నగరంలో థీమ్‌పార్కుల ఏర్పాటు పేరుతో గతంలో రూ.4కోట్లకు పైగా ఖర్చు చేశారు. సాంస్కృతిక సైన్స్ ఫ్రూట్ ఇలా పలురకాల పేర్లతో పార్కులను అభివృద్ధి చేశారు. ఈథీమ్ పార్కుల్లోకి వెళ్లాలంటే తప్పకుండా ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చాలామంది వాటిల్లోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. నగరంలో కొన్ని పార్కుల్లోకి వెళ్లాలంటూ పార్కింగ్ రుసుము కూడా వసూలు చేస్తున్నారు.

అశోక్‌నగర్ పార్కులో క్రికెట్ ఆడుకుంటూ..

అశోక్‌నగర్ పార్కు క్రీడాకారులకు ఆవాసంగా మారింది. ఇక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలు క్రికెట్ ఆడుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. పార్కును అభివృద్ధిచేసి వ్యాయామం చేసేందుకు పరికరాలు, నడక మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా పార్కు ముందర చెత్తా చెదారంతో నిండుకుని ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పార్కు బయటవైపు కాలువలో చెత్త వేయకుండా కంచె ఏర్పాటు చేశారు. మరి మరోవైపు ఏర్పాటు చేయకపోవడంతో పక్కనే ఉన్న వ్యాపారులు ఆ స్థలాన్ని ఇటుకల డంప్ కోసం వినియోగించుకుంటున్నారు. అధికారులు పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తాచెదారం..

ఎన్ఆర్‌పేటలోని తుంగభద్ర నదితీరాన ఉన్న పార్కులో చెత్తాచెదారం నిండుకుని ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్కడే రెండు సచివాలయాలు ఉన్నాయి. శానిటరీ సెక్రటరీలు అక్కడే విధులు నిర్వహిస్తున్నా చూడకపోవడం విడ్డూరమని స్థానికులు చెబుతున్నారు.



అశోక్‌నగర్‌లో పార్కు గేటు వద్ద వేసిన చెత్త



అశోక్‌నగర్‌లో పార్కు ఎదుట డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

పార్కును అభివృద్ధి చేయాలి

అశోక్‌నగర్ పార్కును అన్నివిధాలుగా అభివృద్ధి చేసి పచ్చదనాన్ని పెంచాలి. ఇప్పటికే పలుమార్లు పార్కును అభివృద్ధి చేయాలని కార్పొరేషన్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- శ్రీనివాసరెడ్డి. అశోక్‌నగర్ వాసి

యోగాంధ్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని జాయింట్ కలెక్టర్ నవ్య సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌ను సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో యోగాంధ్ర-2025 యోగా సాధన, అవగాహన మహోత్సవం సందర్భంగా యోగా కార్యక్రమాల ప్రచారం గురించి సోషల్ మీడియా ఇనూఫ్లుయెర్లతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జేసీ నవ్య మాట్లాడుతూ సమాజంలో కొంత మంది మాత్రమే యోగాపై అవగాహన ఉందని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కూడా అవగాహన కల్పించడం అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి విజయ, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, మెప్మా పీడీ నాగ శివలీల, జిల్లా రెసిడెన్షియల్స్ స్కూల్స్ కోఆర్డినేటర్ డా.శ్రీదేవి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ రాజు, రంగస్వామి, రామాంజనేయులు, ఎస్.హర్షిత పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు



మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే టీడీపీ మహానాడుకు ఓర్వకల్లు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవా రం తరలివెళ్లారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆధ్వర్యంలో వారంతా వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, ఎన్.కొంతల పాడు శ్రీనివాసులు, శకునాల మౌళిశ్వరరెడ్డి, లొద్దిపల్లె పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహానాడులో జిల్లా టీడీపీ నాయకులు

కర్నూలు అర్బన్: కడపలో జరిగే మహానాడుకు జిల్లా నాయకులు తరలి వెళ్లారు. మంగళవారం సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి.హనుమతరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, బజారన్న పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత 43 ఏళ్లగా మహానాడుకు హాజరవుతున్నామన్నారు.

రమాబాయి కృషి మరువలేనిది



రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పట్నం రాజేశ్వరీ

కర్నూలు అర్బన్, మే 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన పోరాటాల్లో రమాబాయి కృషి మరువలేనిదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరీ అన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో రమాబాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, పాలేం రాధ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు రిజర్వేషన్ కల్పించాలి



డీపీవోకు వినతి పత్రం ఇస్తున్న వీరేష్

కర్నూలు కలెక్టరేట్, మే 27(ఆంధ్రజ్యోతి): త్వరలో పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించనున్న నేపథ్యంలో అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మంగళవా రం వీసీపీ జిల్లా అధ్యక్షుడు వీరేష్, జిల్లా పంచాయతీ అధికారి భాస్క ర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో.నెం.77 ప్రకారం విభిన్న ప్రతిభావంతులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం: కమిషనర్



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మే 27(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఆరోగ్యం లభిస్తుందని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. మంగళవారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా అవుట్ డోర్ స్టేడియం నుంచి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. యోగాంధ్రలో భాగంగా నెల రోజులపాటు యోగాపై అవగాహన, అభ్యాస కార్యక్రమాలు చేయడానికి ప్రణాళికను కూడా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో రాజారఘువీర్, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి, డీఎస్‌డీవో భూపతిరావు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డీపీవో భాస్కర్, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్‌శెట్టి, ఫిషరీస్ ఏడీ రంగనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో భాగస్వాములు కావాలి: ప్రజలంతా యోగాలో భాగస్వాములు కావాలని కార్పొరేషన్ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం ఆయన ఖానా ఖజానా వద్ద యోగా ఆసనాల ఉచిత శిక్షణలో పాల్గొని ఆసనాలు వేశారు. చిన్నరాముడు మాట్లాడుతూ జూన్ 21 వరకు జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బిర్లా కాంపౌండులోని ఖానా ఖజానా వద్ద ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు యోగా ఆసనాల ఉచిత శిక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు అక్షర, మునిస్వామి పాల్గొన్నారు.



గూడూరులో యోగా శిక్షణలో పాల్గొన్న అధికారులు

గూడూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివనాగప్రసాద్, కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో మంగళవారం ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన యోగాను నిర్వహించారు. యోగా గురువు సోమేశ్వరరెడ్డి యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ పురుషోత్తం, అధికారులు పాల్గొన్నారు.

సొంత పిల్లల్లా చూసుకోవాలి : కలెక్టర్



శిశుగృహంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు హాస్పిటల్, మే 27(ఆంధ్రజ్యోతి): శిశు గృహ కేంద్రంలో ఉన్న చిన్నారులను సొంత పిల్లల్లా ప్రేమతో చూసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని సి.క్యాంపులో ఉన్న శిశు గృహ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రస్తుతం ఎంత మంది చిన్నారులు శిశు గృహాల్లో ఉన్నారని, ప్రతి రోజు పిల్లలను డాక్టర్ పరిశీలిస్తున్నారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిశు కేంద్రం ప్రారంభం అయినప్పటి నుంచి ఎంత మంది పిల్లలు ఉన్నారని, ఇప్పటి వరకు ఎంత మందిని దత్తత ఇచ్చారని ప్రశ్నించారు. శిశుగృహ కేంద్రం ఇన్‌చార్జి మెహతాజ్ బేగం స్పందిస్తూ 2006లో శిశు గృహ ప్రారంభించామని, ఇప్పటి వరకు 132 మంది దత్తత ఇచ్చామని, అందులో ఇతర దేశాలకు 17 మందిని దత్తత ఇచ్చామన్నారు. అనంతరం కలెక్టర్ లివింగ్ రూం, కిచెన్, బాత్రూమ్‌లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శివు గృహ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న పిల్లలను దత్తత ఇవ్వడానికి ఆన్‌లైన్ పోర్టల్‌లో వారి డేటాను నమోదు చేశారా అని కలెక్టర్ ప్రశ్నించారు. దత్తత ఇచ్చిన తర్వాత పిల్లలు ఏవిధంగా ఉన్నారని ఫాలో అప్ చేస్తున్నారా అని ఐసీడీఎస్ పీడీ పి.నిర్మలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా బాలల సరక్షణ అధికారి శారద, శిశు గృహ కేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ మెహతాజ్ బేగం ఉన్నారు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

ఓర్వకల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంచెట్టిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త విజయకుమార్(30) మంగళవా రం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యులను టీడీపీ నాయకులు వెంకట సుబ్బయ్య పరామర్శించారు.

బురదమయంగా వర్కూరు రోడ్డు

● భూమిపూజ, గుంతల చదునుతో సరి
● నేటికీ ప్రారంభం కాని పనులు



వర్కూరు రహదారి దుస్థితి

కోడుమూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో రోడ్డు ఇటీవలే కురిసిన వర్షాల కారణంగా బురదమయంగా మారింది. దీంతో అటుగా వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా పులకుర్తి రహదారి నుంచి చింత తోట వీధికి మట్టి రహదారి ఉంది. ఈమార్గం గుండా చింతతోట వీధి, ముస్లిం, ఉప్పర కాలనీ, బీసీ కాలనీల నుంచి ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలు, బైక్‌లు, ఎద్దులబండ్లతో రద్దీగా ఉంటుంది. స్థానిక చింతతోటలో వెలిసిన అల్లీహుసేన్‌స్వామి దర్గాకు భక్తులు వస్తుంటారు. పులకుర్తి రహదారి దగ్గర నుంచి కలుగొట్ల గోవిందు ఇంటి వరకు మట్టిదారి కావడంతో గుంతలతో ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గంలో రద్దీ దృష్ట్యా సీసీ రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. ఈ ఏడాది జనవరిలో సీసీ రహదారి నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఎక్స్‌వేటర్‌తో గుంతలు చదునుచేసి అంతవరకే సరిపెట్టారు. నాలుగు నెలలు పూర్తికావస్తున్నా పనులు మొదలుపెట్టలేదు. దీంతో ఇటీవల ముందస్తు వర్షాలకు రహదారి మొత్తం బురదమయం కావడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

గిడ్డాంజనేయస్వామికి అమావాస్య పూజలు



పూజలందుకున్న గిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట గిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామికి పూజరులు అమావాస్య పూజలు చేశారు. స్వామివారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. హనుమాన్ చాలీసా పఠించారు. అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు గ్రామస్థులు అన్నదానం చేశారు.

భక్తులకు అన్నదానం

కర్నూలు కల్చరల్, మే 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలోని భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో వైశాఖ అమావ్యాస సందర్భంగా మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. నగరానికి చెందిన పారిశ్రామికవేత్త బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బైరెడ్డి శ్రీలత దంప తులు ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదన్నారు. అంతకు ముందు బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, బైరెడ్డి శ్రీలత దంపతులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

ఆలయ భూముల వేలం వాయిదా

పతికొండ, మే27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికొండ ఆలయ భూముల వేలాన్ని వాయిదా వేసినట్లు ఈవో వీరయ్య మంగళవారం తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియచేస్తామన్నారు.

చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ

మద్దికెర, మే 27 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు జూన్ 1 నుంచి చౌకదుకాణాల్లోనే సరుకులు ఇస్తామని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం చౌక దుకాణాలను పరిశీలించారు. సరుకుల కోసం డీలర్లు డీడీలు చెల్లించాలన్నారు. దుకాణాలను రోజూ ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు 15 రోజుల పాటు దుకాణాలను క్రమం తప్పక తెరవాలన్నారు. ఆర్ఐ రామదాసు ఉన్నారు.


కార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

పారిశుధ్య పనులు చేయించాలి

దేవనకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని సీపీఎం నాయకుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. దేవనకొండ, కుంకనూరు, తెర్నేకల్, పి.కోటకొండ గ్రామాల్లో వర్షాలు కురిసి కాలనీల్లో మురుగు చేరి దుర్గంధం వస్తోందన్నారు. కాలువలు లేకపోవడంతో సమస్య ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో టీవీ రమణరావుకు వినతిపత్రం ఇచ్చారు. యూసుఫ్‌బాషా, ఆశోక్, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కమిషనర్‌కు సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ కృష్ణకు గ్రేడ్ వన్ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో మంగళవారం బీజేపీ నాయ కులు సన్మానించారు. పదోన్నతి అనతరం ఇక్కడే పోస్టింగ్ ఇవ్వడంతో పట్టణ సమస్యలపై అవగాహన ఉన్న కమిషనర్ అభివృద్ధి పనులకు ప్రాముఖ్యత ఇస్తారని ఆశిస్తున్నామన్నారు. హంస్సేనప్ప, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, లోకేష్ కుమార్, మరియాని చెన్న బసప్ప, కౌన్సిలర్ సురేష్, సురేంద్ర వీరేష్, వీరాంజినేయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ఆలూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జ్యోతిబసు భవనంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సమావేశం కేపీ నారాయణస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు గెలిచాక పేదలపై భారం వేయడం సరికాదన్నారు. సీపీఎం తరపున రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు కలిగే నష్టాన్ని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తుందన్నారు. పి.హనుమంతు, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, రత్నమ్మ, విఠల్, ధనుంజయ, ప్రేమ్ రాజ్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో దోమల మందు పిచికారీ


దోమల మందును పిచికారీ చేయిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర, మే 27 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాల హాస్టళ్లలో జిల్లా మేరియా అధికారి నూకరాజు ఆదేశాల మేరకు మంగళవారం సిబ్బంది దోమల మందును పిచికారీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి మాట్లాడుతూ వారం నుంచి వర్షాలు కురుస్తున్నాయని, పాఠశాల పునః ప్రాంభంలోపు దోమలు వృద్ధి చెందకుండా మందును పిచికారీ చేశామన్నారు. మలరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో నిరంజన్‌బాబు హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు ఉన్నారు.

ఈరన్నస్వామి ఆలయంలో పూజలు

పత్తికొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ- ఆదోని రహదారిలోని ఈరన్నస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము 5 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవ చేశారు.

జూన్ నుంచి దుకాణాల్లో రేషన్

వెల్దుర్తి, మే 27(ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు జూన్ నుంచి చౌకదుకాణాల్లో రేషన్ ఇస్తామని తహసీల్దార్ చంద్రశేఖరవర్మ అన్నారు. మంగళవారం కార్యాల యంలో మాట్లాడుతూ ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దుచేసి పాతపద్ధతిలోనే రేషన్‌షాప్‌లలో సరుకుల పంపిణీకి చర్యలు తీసుకుందన్నారు. ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు అందుబాటులో ఉంటారన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటివద్దకే రేషన్‌ను ఇస్తామన్నారు డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ కార్యాలయంలో యోగా


యోగా చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణలోని సీపీఐ కార్యాలయంలో శిక్షకుడు విశ్రాంత పీడీ టీపీసీ రంగస్వామి ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. యోగా ద్వారా మానసిక, శారీరక ధృఢత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, నాయకులు రాజాసాహెబ్, నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆదోనిలో కొత్తగా అభివృద్ధి చెందిన ప్రాంతం



పెరగనున్న పుర ఆదాయం

- ఆస్తి పన్నుల మదింపుపై సర్వే
- పాత, తక్కువ ఉన్న భవనాల పన్నుల పెంపు

ఆదోని టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పట్టణ పరిధిలో నూతనంగా నిర్మించిన, అదనంగా నిర్మంచిన వాటిని గుర్తించేందుకు సిబ్బంది సర్వే ప్రారంభించారు. ఆస్తిపన్నులలో తేడాలను గమనించి, నిర్మాణ పరిధి కన్నా తక్కువగా పన్నులు చెలిస్తున్నట్లు గమనిస్తే గెజిట్ ప్రకారం సరి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

పాత పన్నులే చెల్లింపు..

పాత, మట్టి భవనాల స్థానంలో, నూతన గృహాలు నిర్మించుకున్న యజమానుల పాత పన్నులే చెల్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని అధికారుల దృష్టికి రాకపోవడం, మరికొన్ని చోటా నాయకుల జోక్యం ఉండటంతో పుర ఆదాయానికి గండి పడుతోంది.

పన్నుల పరిధిలో లేనివి

అధికారిక లెక్కల ప్రకారం పట్టణంలో 35,500 నివాసిత, వాణిజ్య, పారిశ్రామిక నిర్మాణాలు ఉన్నాయి. 37 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 2 లక్షల జనాభా ఉన్న పట్టణంలో 35,500 అసెస్మెంట్లు మాత్రమే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించని కారణంగా చాలా వాటికి పన్నులు వేయలేదని తెలుస్తోంది.

పన్నులు భారీగా పెరిగే అవకాశం

ప్రస్తుతం మున్సిపాలిటీకి ఏడాదికి రూ.12 కోట్లు ఆస్థిపన్నుల నుంచి ఆదాయం వస్తోంది. స్థానిక నాయకుల ప్రమేయం, ఒత్తిడి లేకుండా, పకడ్బం దీగా సర్వే చేస్తే రూ.2.5కోట్ల మేర పెరిగే అవకాశం ఉందని పుర అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో సర్వే



ప్రభుత్వ ఆదేశాలతో ఆస్థిపన్నుల పై సర్వే నిర్వహించి, ముదింపు చేస్తున్నాం. పన్నులు లేని వారిని పన్నుల పరిధిలోకి తీసుకువచ్చి, తక్కువ చెల్లిస్తున్న వారి పన్నులను సరిచేస్తాం. ప్రజలు సహకరిస్తే, పుర ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

- నాసిర్ అహ్మద్, ఆర్‌వో, పురపాలక సంఘం, ఆదోని.

విత్తనాల కోసం నమోదు చేసుకోవాలి

దేవనకొండ, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే రాయితీ వేరుశనగ, కంది విత్తనాల మంజూరుకు రైతులు నమోదు చేసుకోవాలని ఏవో సురేష్ బాబు సూచించారు. మండలానికి 1,675 క్వింటాళ్ల వేరుశనగ, 24 క్వింటాళ్ల కంది విత్తనాలు మంజూరయ్యా యన్నారు. వేరుశనగ క్వింటం ధర రూ.9,300లు కాగా సబ్సిడీ ధర రూ.5,580లుగా, అలాగే కింది రూ.10,950కు గాను సబ్సిడీ రూ.7,665లుగా ప్రభుత్వం నిర్ణయించింని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

మహానాడుకు నాయకులు

మద్దికెర, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం మహనాడుకు మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్ జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు ఆధ్వర్యంలో కడపకు బయలుదేరారు. ఈడిగ చంద్రశేఖర్ గౌడ్, ఎన్. లక్ష్మి నారాయణ, ఆకుల వేణుపాల్, పారా రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

మహానాడులో నాయకులు, అనుచరులు


ప్రాంగణంలో మీనాక్షినాయుడు, ఉమాపతినాయుడు


మంత్రి లోకేష్‌తో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్


ప్రాంగణంలో వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆదోని, మే 27(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో మంగళవారం ప్రారంభమైన మహానాడులో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. మీనాక్షి నాయుడు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాని కాపాడేందుకే టీడీపీ ఏర్పడిందన్నారు. నాడు పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే దివంగత ఎన్టీఆర్ అధికారంలోకి రావటం చారిత్రకమన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు, జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారన్నారు. నాయకులు ఉమాపతి నాయుడు, బత్తిన కుబేర్ నాథ్, శ్రీనివాస ఆచారి, రామస్వామి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలూరు నాయకులు

ఆలూరు, మే27 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు కడప మహానాడులో పాల్గొన్నారు. మొదటిరోజు మంత్రి లోకేష్‌ను టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కలిశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, నాయకురాలు వైకుంఠం జ్యోతి అనుచరులతో కలిసి హాజరయ్యారు.

మహానాడుకు నాయకులు

క్రిష్ణగిరి, మే 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మహనాడుకులో పాల్గొనేందుకు కడపకు బయలుదేరారు. పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆలంకొండ నబీసాహెబ్, కటారుకొండ మద్రి శ్రీరాములు ఉన్నారు.


ఆదోనిలో యోగా చేస్తున్న కమిషనర్ కృష్ణ, సిబ్బంది

జూన్ 21 వరకు యోగా శిక్షణ

మద్దికెర: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21 వరకు యోగా శిక్షణ ఇస్తున్నట్లు తహసీల్దార్ హుశేన్ సాహెబ్, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం డీపీఏపీ కమ్యూనిటీ హాలులో యోగా చేశారు. యోగాతో ప్రశాంతత వస్తుందన్నారు. డీప్యూటీ ఎంపీడీవో శివకుమార్ పాల్గొన్నారు.

తుగ్గలి: ఎంపీడీవో విశ్వమోహన్ ఆధ్వర్యంలో కార్యదర్శులు, వీఆర్వోలకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్‌డీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శులు నారాయణ స్వామి, రాజు నాయక్, గోపాల్, శివ, రామకృష్ణ ఉన్నారు.

యోగా అభ్యసించాలి

ఆదోని టౌన్ , మే 27(ఆంధ్రజ్యోతి): రోజూ యోగాభ్యాసం చేయాలని మునిసిపల్ కమిషనర్ కృష్ణ సూచించారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం గణేష్ సర్కిల్ సచివాలయంలో ఆసనాలు వేశారు. ఆసనాలు వేస్తే రుగ్మతలు దూరమై శరీరం ఫిట్‌గా ఉంటుందన్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఆపరేటర్లు

పత్తికొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ అందించే ఎండీయూ వాహనాలను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వాహనాలతో ఎండీయూ ఆపరేటర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటింటికి రేషన్ సరఫరా చేసేందుకు ఎండీయూ వాహనాలను తెచ్చిందని, టీడీపీ ప్రభుత్వం వాటిని తొలగించడం సనరికాదన్నారు. ఆపరేటర్లను తొలగిస్తే కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు దస్తగిరి, ఆపరేటర్లు రామ్మోహన్ రెడ్డి, మధుబాబు, బాల్‌రాజు, నరసింహులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడా వస్తే డీలర్లపై చర్యలు

- సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి: ఆర్డీవో భరత్‌నాయక్


స్టాక్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

ఆలూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు ఇచ్చే రేషన్‌లో తేడా వస్తే డీలర్లపై చర్యలు తప్పవని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని 31వ వార్డు రేషన్‌షాపును తనిఖీ చేసి, స్టాక్‌ను పరిశీలించారు. స్థానిక అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. తహసీల్దార్ గోవింద్‌సింగ్, ఆర్ఐ బసవన్నగౌడ్, వీఆర్వో మహేంద్ర, డీలర్ రంగయ్య పాల్గొన్నారు.

రీ సర్వే అభ్యంతరాలను పరిష్కరించండి

రీ సర్వే చేసిన గ్రామాల్లో వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించాలని ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆలూరు, హాలహర్వి మండలాల వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఏ ఒక్క రైతు భూములు కోల్పోకుండా సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. తహసీల్దార్ గోవింద్‌సింగ్, డివిజనల్ సర్వేయర్ భాస్కర్, ఆర్ఐ బసవన్నగౌడ్ పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన నాయకులు

వెల్దుర్తి, మే 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడుకు మండల నాయకులు, కార్యకర్తలు మంగళవారం కడపకు తరలివెళ్లారు. జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, కన్వీనర్ బలరాంగౌడ్ ఆధ్వర్యంలో వెల్దుర్తి టీడీపీ కార్యాలయం నుంచి కార్లు, బస్సుల్లో గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లారు.

యోగాతో మానసిక ఉల్లాసం

వెల్దుర్తి, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, జీవితంలో భాగం కావాలని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం శ్రీగిరి గోవర్ధన్ ఛారిటబుల్ ట్రస్టు భవనంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న యోగ శిక్షణను తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, ఎంపీడీవో సుహాసినమ్మ, వైద్యాధికారి భారతి ప్రారంభించారు. సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, ఎంఈవో-2రమేశ్, ఏపీవో లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శి గురుస్వామి పాల్గొన్నారు.

నేడు స్క్రీనింగ్ శిబిరం

ఆదోని టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ, ఏపీఆర్ హాస్పిటల్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో పెదవి, అంగిలి చిలికకు శస్త్ర చికిత్సల కోసం బుధవారం స్కీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 11గంటల నుంచిమధ్యాహ్నం 3 గంటల వరకు ఉచితంగా చేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

తుగ్గలి, మే 27 (ఆంధ్రజ్యోతి): బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. ఎంపీపీ రామాంజనమ్మ అధ్యక్షత వహిస్తారని, అధికారులు, ప్రజాప్రతినిధులు నివేదికలతో హాజరు కావాలన్నారు.

విత్తనాలకు రసీదు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, మే 27 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు కొనే సమయంలో రైతులు తప్పక రసీదు తీసుకుని భద్రపరచుకోవాలని ఏఈవో అశోక్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కార్యాలయంలో మాట్లాడు తూ ఈ ఏడాది సాగు విస్తీర్ణం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు.

కంచె ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి): పందికోన సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువకు కంచె ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్దయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం సమర్పిం చారు. నిత్యం వాహనాలు వెళుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, కాలువకు కంచె వేయాలని కోరారు. అల్తాఫ్, రవి, రంగన్న ఉన్నారు.

పడకేసిన పారిశుధ్యం


తహసీల్దార్ కార్యాలయం వద్ద కాలువ ఇలా..

ఆలూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. బళ్లారి రహదారి పక్కన కాలువ తేరుబజారు నుంచి తహసీల్దార్ కార్యాలయాన్ని వెళ్లే రహదారిలో డ్రైనేజీ చెత్తాచెదారంతో నిండిపోయింది.

రెయిలింగ్ లేని వంతెన


లింగాల వంక వద్ద ప్రమాదకరంగా వంతెన

తుగ్గలి, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని బెంగుళూరు-మంత్రాలయం రహదారిలో లింగాల వాగు వంతెన రెయిలింగ్ దెబ్బతింది. ఈ దారిలో నిత్యం భారీ వాహనాలు, కార్లు వందల సంఖ్యలో వెళుతుంటాయి. రెయిలింగ్ లేకపోవడంతో వాహనదారులు భయపడుతూనే వెళుతున్నారు. ఏమాత్రం అదుపు తప్పినా వాహనాలో లోయలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఇలా పడేశారు

హాలహర్వి, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు తక్కువ ధరకే ఇవ్వాలని చింతకుట సొసైటీ ఆధ్వర్యంలో రాయితీ కింద ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. అయితే సొసైటీ, వ్యవసాయ అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ట్రాక్టర్ తమకు అందడం లేదని చింతకుంట రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ట్రాక్టర్ ఇలా పనికిరాకుండా పోయింది.


సొసైటీ ఆవరణలో తుప్పు పట్టిన ట్రాక్టర్

నరకదారి



మండలంలోని హొళగుంద-దణాపురం రోడ్డు నరకానికి దారిగా మారింది. 26 కి.మీ.ల మేర గుంతలు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో రూ.63కోట్లతో నిధులు మంజూరు కాగా, వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ విషయంపై ఆర్అండ్‌బీ సాయి సురేష్‌ను వివరణ కోరగా వైసీపీ ప్రభుత్వం పనులను రద్దు చేసిందని, ఇప్పటికే ప్రభుత్వానికి రోడ్డు స్థితిగతులపై నివేదిక అందించినట్లు తెలిపారు. - హొళగుంద

ఖరీఫ్ సాగు మొదలు

ఆదోని అగ్రికల్చర్, మే 27 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలోని ఆరేకలు, పాండవగల్లు, కుప్పగల్లు, నాగలాపురం, దిబ్బనకల్లు, కుప్పగల్లు, జాలమంచి, ఇరుపాపురం గ్రామాల పొలాల్లో పత్తి విత్తుతున్నారు. ఈ ఏడాది పత్తిని అత్యధికంగా సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

దిబ్బనకల్లులో పత్తి విత్తుతున్న కూలీలు, ఇన్‌సెట్‌లో సేద్యం చేస్తున్న రైతు



మండలంలో జోరుగా సాగు పనులు


వ్యవసాయ పనుల్లో కూలీలు

కౌతాళం, మే 27(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని రైతన్నలు రెండు రోజులుగా విత్తు పనుల్లో నిమగ్నమైనారు. ఉదయం నుంచే పొలాల్లో వ్యవసాయ పనుల్లో పూర్తి బిజీగా ఉన్నారు. ఈ నెల 24న రోహిణి కార్తె రోజున వర్షం రావడంతో పంటలు బాగా పండుతాయని రైతన్నలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు కొందరు రైతులు దుక్కి పనుల్లో, మరికొంత మంది అన్నదాతలు పత్తి విత్తు పనుల్లో కూలీలతో బిజీగా ఉన్నారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు ఎరిగేరి, కామవరం, బాపురం, ఉరుకుంద, మల్లనహట్టి గ్రామాల్లో రైతులు విత్తనాల పనుల్లో బిజిగా కనిపించారు. మధ్యాహ్నం నుంచి వర్షం కురియడంతో విత్తనాలు నాటిన రైతులు పంటలు బాగా పండుతాయని సంతోషం వ్యక్తం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న సీడీపీవో నరసమ్మ

మంత్రాలయం, మే 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాల బాలికలు అన్నిరంగాల్లో రాణించినపుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రాలయం సీడీపీవో నరసమ్మ అన్నారు. మంగళవారం రాఘవేంద్రపురంలోని అంగన్‌వాడీ నాలుగో కేంద్రంలో కిషోరి బాలికల వికాస్ వేసవి కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్య నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో భద్రత, వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరగోవిందమ్మ, పీహెచ్‌సీ జ్యోతి, మహిళా పోలీసు శాంతి, అంగన్‌వాడీ టీచర్ శ్వేత, సుజాత, లలిత, మహిళలు పాల్గొన్నారు.

రిటైర్డు వీఆర్‌వో మృతి


వీరన్నగౌడు (ఫైల్)

మంత్రాలయం, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రిటైర్డు వీఆర్‌వో వీరన్నగౌడు (69), సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ బెస్త ఆంజినేయులు, ఎంపీటీసీ రామాంజినేయులు, మాజీ ఎంపీటీసీ బెస్త ఈరన్న, సర్పంచ్‌లు అల్లిలింగప్ప, వెంకటేష్, తహసీల్దార్ ఎస్ రవి, ఆర్ఐ ఆదాం, వీఆర్‌వోలు భీమన్న గౌడు, భీముడు, ఆనంద్, బసన్నగౌడు, మృతదేహానికి నివాళులర్పించారు. తిక్కస్వామి, నాగేంద్ర, డానియేలు, నాగేష్, రవి పాల్గొన్నారు.

జీడీపీ పర్యాటకంగా వెలిగేనా?

- టీడీపీ ప్రభుత్వంలోనైనా ప్రత్యేక నిధులు కేటాయించాలి
- ప్రకటనలకే నేతలు, అధికారుల మాటలు
- ఇబ్బందుల్లో పర్యాటకం
- శిథిలావస్థకు చేరిన పార్కులు

గోనెగండ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పర్యాటకులతో విలసిల్లిన గాజులదిన్నె ప్రాజెక్టు నేడు వైభవం కోల్పోయింది. ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయింది. అయితే ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చుతామని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు హామీలు ఇవ్వడం వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. టీడీపీ ప్రభుత్వంలో అయినా జీడీపీ పర్యాటక రంగంగా వెలుగొందేనా అని పర్యాటకప్రియులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 25 ఏళ్ల క్రితం గాజులదిన్నె ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా ఉండేది. నాయకులు, అధికారుల అలసత్వం కారణంగా 18 ఏళ్లగా పర్యాటక రంగ అభివృద్ధి అనే జాడనే కనిపించడం లేదు. మునుపు ప్రాజెక్టు పరిసరాలలో కొబ్బరి, నీలగిరి, టేకు చెట్లతో తోటలు కనువిందు చేసేవి. పర్యాటకుల సౌకర్యం కోసం అతిథిగృహం కూడా ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అవి మరుగున పడ్డాయి. ఏడేళ్ల క్రితం ఏపీ పర్యాటక రంగం అధికారులు వచ్చి సర్వే చేసి వెళ్లారు. అంతే అంతటితో ఆ పని నిలిచిపోయింది. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును ఏమాత్రం పట్టించుకోక, నిధులు కేటాయించకపోవడతో ఈ విధంగా మారింది. ఈ ప్రభుత్వంలోనైనా పర్యాటకరంగ మంత్రి, అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించి నిధులు కేటాయించాలని పర్యాటక ప్రియులు కోరుతున్నారు.

కనుమరుగైన కొబ్బరి, నీలగిరి, టేకు చెట్లు

జీడీపీ ఎల్ఎల్‌సీ కాలువల మధ్య పర్యాటకులను ఆకర్షించే విధంగా కొబ్బరి, టేకు, నీలగిరి మొక్కలను నాటి పెంచారు. అయితే వాటిని కాపాడేందుకు వాచ్ మెన్‌ను ఏర్పాటుచేయకపోవడంతో ఆచెట్లన్నీ కనుమరుగయ్యాయి. పార్క్‌కు కూడా రక్షణ లేక పోవడంతో పూర్తిగా దెబ్బతిని పోయింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు పార్క్‌లోని చెట్లను కొట్టుకుపోయారు. ఇప్పుడు కేవలం పిచ్చిమొక్కలు ముళ్ల పొదలు దర్శనం ఇస్తున్నాయి. అయితే ఏడాది క్రితం ఉపాధి హామీ పథకం కింద అధికారులు కొబ్బరి, మామిడి, నీడనిచ్చే మొక్కలను నాటినా వాటి రక్షణ బాధ్యతను గాలికి వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి.


పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన పైలాన్

పండుగ సమయంలో కళకళ

ఈప్రాజెక్టు వద్ద సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నా పండుగల సమయంలో మాత్రం పర్యాటకుల సందడి నెలకొంటుంది. ఉగాది, దసరా, రంజాన్, బక్రీద్, తదితర రోజులలో ఎమ్మిగనూరు, కర్నూలు, గూడురు. కోడుమూరు, బెళగల్, ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చి వెళుతున్నారు. ప్రస్తుతం అతిథిగృహాన్ని మాత్రం మరమ్మతు చేశారు.

అప్పటి సబ్‌కలెక్టర్ ఆదేశాలు అమలు జరగలేదు

రెండేళ్ల క్రితం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గాజులదిన్నె ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి అక్కడ జరుగుతున్న ప్రాజెక్టు కట్ట ఎత్తు పనులను పరిశీలించారు. గాజులదిన్నె ప్రాజెక్టును పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పర్యాటకుల కోసం రోడ్డు, తాగునీరు, వసతి, మరుగుదొడ్లు, తోటలు పెంచడం తదితర కార్యక్రమాలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు జరిగితే మరోసారి గాజులదిన్నె పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటి వరకు ఆ పనులు మొదలుకాలేదు.


మోడుబారిన నీలగిరి తోట

ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి

గాజులదిన్నె పర్యాటక రంగానికి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రతి ఏడాది ప్రజాప్రతినిధులు రావటం ప్రాజెక్ట్‌ను సందర్శించి పర్యాటక రంగ అభివృద్ధికి పాటుపడతాం అని చెప్పటం వెళ్లటం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు కేటాయించాలి.

- శ్రీనివాసులనాయుడు, గాజులదిన్నె


పిచ్చి మొక్కలతో నిండి ఉన్న ప్రాజెక్టు పర్యాటక ప్రాంతం

రాఘవరాయడికి విశేష పంచామృతాభిషేకం

- మంచాలమ్మకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం


బంగారు కవచ అలంకరణలో బృందావనం

మంత్రాలయం, మే 27 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య రామవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా నిర్వహించారు. మంగళవారం వైశాఖ అమావాస్య పర్వ దినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు బృందావనానికి, గ్రామదేవత మంచాలమ్మకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, సుగంధద్రవ్యాలతో, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులకు హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు.

స్వర్ణ రథంపై శోభిల్లిన ప్రహ్లాదరాయలు

రామవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై విహరించారు. మంగళవారం వైశాఖ అమావాస్య శుభదినం ను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్చరణాలు, మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


ఎమ్మిగనూరులో యోగా చేస్తున్న కమిషనర్, సీఐ


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, పీఈటీలు

ఎమ్మిగనూరు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని పలువురు అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం అన్ని మండలాలో కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అధ్వర్యంలో మండల స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేది జరగబోయే 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలో నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమాల గురించి, యోగా శిక్షణ తరగతుల గురించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్, ఆయూష్ డైరెక్టర్ దినేష్‌లతో 2025 యోగాంధ్ర కార్యక్రమం గురించి మాట్లాడారు. ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేయడం, ప్రణాళికల దిశా నిర్దేశం చేయడం గురించి చర్చించారు. ఇందులో భాగంగా పట్టణ సీఐ శ్రీనివాసులు, తహసీల్దార్ శేషఫణి, ఆయుష్ నోడల్ అధికారి స్వర్ణలత, ఎంఈఒ మధుసూదన్ రావు ట్రైనర్లు, మెప్మా అధికారులు, పీఈటీలు ఉమాపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్డీ అనంతశయన అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఎంపీడీవో మణిమంజరి ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ ఎంపీడీవో కార్యాలయం నుంచి గ్రామ పురవీధుల గుండా యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్రగా గుర్తించిందని అందుకుగాను ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. త్వరలో ప్రతి మండలం నుంచి ఇద్దరు ఉద్యోగులను ఎంపిక చేసి వారికి ట్రైనింగ్ ఇస్తారని వారు గ్రామంలోని ప్రజలచే యోగా కార్యక్రమం నిర్వహించి యోగా వల్ల కలిగే లాభాలు వివరించాలని తెలిపారు కార్యక్రమంలో పలు గ్రామాల కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు, మే 27(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు యోగాను అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎంపీడీవో ప్రభావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడబూరు కార్యాలయంలోని 86 మంది సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని యోగాతోనే ఆ భాగ్యం కలుగుతుందన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాల్లోని ప్రజలకు యోగా పట్ల శిక్షణ, అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు రంగన్న, శాంతిరాజు, దుబ్బన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది


పెద్దకడబూరులో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

స్వరూపం కోల్పోయిన మాధవరం వాగు

- వర్షం వస్తే పొలాల్లోకి వరద నీరు
- లబోదిబోమంటున్న రైతులు

మంత్రాలయం, మే 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మాధవరం ప్రధానమైన వాగు తన స్వరూపానే కోల్పోయింది. దాదాపు మూడు మండలాల్లోని 30 గ్రామాల నుంచి కాలువల ద్వారా నీరు ఈ వాగులోకి చేరుతుంది. ఈ వాగు తుంగభద్రలో కలుస్తుంది. పూడికలు తీయకపోవడంతో ఈపొలాల్లోకి ప్రవహించి రైతులకు తీరని నష్టం మిగులుస్తోంది. రాజకీయ కారణాలతోనే వాగును పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చెట్టు-నీరు పథకం కింద నిధులు మంజూరైన వర్గవిభేదాలతో పనులు నిలిచిపోయాయి. దీంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. వర్షాలు వచ్చిన ప్రతిసారి నిండుగా పారుతూ అటూ ఇటూ రైతులు సాగు చేస్తున్న పొలాలకు వరద ముప్పుతో భారీ నష్టం వాటిల్లుతున్నది. దాదాపు 60 కిలోమీటర్లు ఉన్న వాగును తిమ్మాపురం, వగరూరు వరకు పనులు చేపట్టారు. సూగూరు నుంచి తుంగభద్ర నది వద్ద కలిసే దాదాపు 6 కిలోమీటర్ల వాగుకు ఇరువైపులా ఉన్న చెట్లు, పొదలు చేయాల్సి ఉంది. గుర్రపునాడ మొక్కలు మొలిచి నీరు కనిపించకుండా వంక స్వరూపమే కళ తప్పింది. తుంగభద్ర డ్యాం నుంచి లక్షల క్యూసెక్కులు నీరు వదిలిప్పుడు ఈ వంకలోకి పొంగి పొలాల్లోకి వెళ్లి చెరుకు, పత్తి, వరి, మిరప వంటి వందలాది ఎకరాల్లో నష్టం వాటిల్లితుంది. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి మాధవరం ప్రధాన వాగుకు ముళ్లపొదలను, గుర్రపునాడు మొక్కలను తొలగించి వాగు ప్రవాహం ముందుకు వెళ్లేలా పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మాధవరం వంకలో ముళ్లకంప

ఉరుకుందలో ప్రత్యేక పూజలు


వెండి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు

కౌతాళం, మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం నందు మంగళవారం అమావాస్య సందర్భంగా దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు ఆలయంలో స్వామి వారికి అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన సేవలు జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారికి పుష్పార్చన చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి తెల్లవారుజామునే శుద్ధజలంచే పూజించి ప్రత్యేక పుష్పాలతో ఆలంకరించి మూలవిరాట్‌ను వెండి తొడుగుతో అలంకరించి మహా మంగళహారతితో పూజించి దర్శనం కల్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

21వ రోజుకు సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, మే 27 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు , న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు.

చినుకు పడితే రోడ్లన్నీ..చిత్తడే

- రోడ్డుపైనే మురుగునీరు
- చిన్నపాటి చెరువులను తలపిస్తున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు


మంత్రాలయం ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగునీరు


చిత్తడిగా మారిన బైలుప్పల-తెర్నెకల దారి


ఎమ్మిగనూరు రోడ్లను చూపుతున్న సీపీఎం నాయకులు

వర్షాలతో ఒకవైపు పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు ఆనందపడుతున్నా మరోవైపు రోడ్లన్నీ చిత్తడిగా మారిపోయి నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామునే పొలాలకు వెళ్లే రైతులు, వివిధ పనుల రాకపోకలు సాగించే ప్రజలు ఈ గుంతలమయమైన రోడ్లతో అవస్థలు పడుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందిచి మరమ్మతులు చేయలని కోరుతున్నారు.

మంత్రాలయం, మే 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ప్రధాన రహదారులపైనే మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. పట్టించుకోవాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు, గ్రామస్థులు, దుకాణాల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి చిన్నపాటి వర్షానికే రోడ్లపైనే మురుగునీరు నిలిచి ఉండటంతో, ఆ మురుగునీరుపైనే కుక్కలు, పందులు తిరుగుతుండటంతో దోమలకు నిలయంగా మారాయి. నాగులదిన్నె రోడ్డు, నదీతీరం, బస్టాండు, ఆర్అండ్‌బీ గెస్‌హౌస్ ముందు భాగంలో మురుగునీరు నిలిచి అస్థవ్యస్తంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులతో క్లీనింగ్ చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమలు, దుర్వాసన లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు

గోనెగండ్ల: మండలంలోని పల్లెల రహదారులు అధ్వానంగా మారిపోయాయి. చిన్న పాటి చినుకుల కురిస్తే రహదారులు చిత్తడి చిత్తడిగా మారిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. బైలుప్పల గ్రామంలో చినుకు పడితే దారులన్నీ చిత్తడిగా మారిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిపోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. బైలుప్పల నుంచి తెర్నెక ల్లు, బన్నూరు గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిపోయింది గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జలమయమైన రోడ్లు

ఎమ్మిగనూరు టౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలో రోడ్లన్నీ జలమయమై ప్రజలు ఇబ్బం దులకు పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని తేరుబజార్‌లో టోపయ్య గుడి దగ్గర ఇటీవల కాలంలో రోడ్డు నిర్మాణం జరిగిందని నిర్మాణ పనుల్లో భాగంగా పద్మశాలి కళ్యాణమండపం ముందు గ్యాప్ పెట్టడం వల్ల వర్షపు నీరు బయటికి వెళ్లడానికి డ్రైనేజి సౌకర్యం లేకపో వడంతో అక్కడే నిల్వ అవుతోందన్నారు. పట్టణంలో చంద్రయ్య కొట్టాలు, పాత దళితవాడ, శివారు కాలనీలో వర్షపు నీరు వచ్చిన ప్రతి సారి ఇబ్బందులు తప్పడం లేదన్నారు.